# "ఔను, నేనే."

★

శ్రీ కృష్ణమూర్తి.



రంగనాథం ఈ ప్రపంచాన్ని మళ్లా కళ్లతో చూచేటప్పటికి బ్రతుకు మీద గంపెడంత ఆసక్తి, ఉత్సాహం కలిగింది. అతను పది సంవత్సరములనుండీ జైలు ఆవరణాన్ని తప్ప మరి యితర ప్రపంచాన్ని చూచి ఎరుగడు. అసలు అతను జయిలుకు వెళ్ళటానికి ఒక కారణముంది.

రంగనాథం తండ్రిపేరు రామనాథం చాలా ఆస్తిపరుడు. ధర్మాత్ముడు కూడాను. రామనాథం భార్య లక్ష్మీదేవి. చాలా అందగత్తె సద్గుణవతి పేరును సార్ధకపరుచు ఉత్తమయిల్లాలు. అట్టి దంపతులకు రంగనాథం వుద్భవించాడు. చిన్నప్పుడు అల్లారుముద్దుగా పెంచబడ్డాడు. అంచేత 18 ఏండ్లు వచ్చేసరికి చెడుసహవాసాలబ్బినయ్యి. ఒక crackలా తయారయినాడు. దుర్వ్యాత్తిపరుడయినాడు. త్రాగుడు అలవాటయింది. జూదముకూడా ఆడడం మొదలుపెట్టాడు. జూదంలో అతనికి వేణునాథం అనే స్నేహితుడు దొరికాడు. వేణునాథం కటిక దుర్మార్గుడు.

విలాసవతి అనే వేశ్యను చేరదీసినాడు. కొన్నాళ్లకు డబ్బు అయిపోగా విలాసవతి నిద్రపోతూవుంటే ఆమె నగలు అపహరించి, పారిపోయి, పట్టుబడి మూడు నెలల శిక్షకు పాత్రుడైనాడు. ఇటువంటి వేణునాథం, రంగనాథమునకు ప్రాణస్నేహితుడయినాడు. మొదటమొదట రంగనాథమునకు రామనాథం డబ్బు అమితంగా యిస్తూ వుండేవాడు. తరువాత సంగతి గ్రహిం

చాడు. కుమారుణ్ని అనేకవిధాల మందలించాడు. కన్న కడుపు ఎలా అయినా!! కాని ప్రయోజనం శూన్య మయింది. తండ్రి కుమారునిపై ప్రేమవదలి యింట్లో నుంచి వెళ్ళగొట్టినాడు. కాని తల్లి కన్నకడుపును కాల్చుకుంటుందా!!! లక్ష్మీదేవి అతనికి చాటు మాటుగా ధనాన్ని పంపుతూ వుండేది. ఈ విధంగా కొంతకాలం గడిచింది. రంగనాథానికి తల్లి పంపేధనం చాలేదికాదు. సహవాస దోషంవల్ల అతనుకూడా వేశ్యాలోలుడైనాడు. డబ్బుకు మహా సంకటపడు తున్నాడు.

ఇట్టి స్థితిలో రామనాథం పరమపదించాడు. తండ్రిచావుతో కుమారుడు గృహప్రవేశ మయినాడు తల్లివద్ద అతని ఆగడం మితిమీరింది. ఇంట్లోవున్న డబ్బంతా జూదంలో తగవేస్తూ వుండేవాడు. తల్లిమాట అతనికి లక్ష్యం లేకపోయింది. ఆస్తి అంతా ఏడాది లోపలనే ఖాళీ అయింది. అతను ఓ రోజున జూద మాడటానికి వెళ్లాడు. ప్రక్కనే ప్రాణ స్నేహితుడు వేణునాథం వున్నాడు. ఆటలో తల్లి నగలు తాకట్టు పెట్టి తెచ్చిన అయిదువేల రూపాయిలు పొరుగూరి వాడు గెల్చుకున్నాడు. ఆట ఎత్తివేశారు. పొరుగూరి వాడు సంచి చంక బెట్టుకుని ప్రయాణానికి లేచాడు. స్నేహితుడు వేణురంగానికి కనుసైగ చేశాడు. తక్షణమే రంగనాథం ఆ పొరుగూరి వాడిమీద పడి పీక నులిమి చంపి సొమ్ము సంచీ చేబట్టినాడు. గంద్రగోళం విని గస్తీ తిరుగుతున్న పోలీసులు జూదశాల ప్రవేశించడ మేమిటి!! వేణు నాథం పలాయన మంత్రం పఠించడ మేమిటి!!! రెండూ ఒక్కసారే జరిగినయ్యి. రంగనాథం డబ్బు సంచీతో సహా పట్టుపడ్డాడు. హత్యానేరం బుజువైంది. రంగ నాథానికి పదియేండ్లు శిక్ష విధించారు. ఈ సంగతి విని లక్ష్మీదేవి చనిపోయింది.

జయిలు భోజనం సయించక పోవడం వల్ల రంగనాథం చిక్కి శల్యమైనాడు. జైలులో, తన దుస్ప్ర వర్తననూ, దుస్సహవాసాన్ని తలంచుకుని పశ్చాత్తాప పడినాడు.

ఆ రోజుననే అతడు విడుదల అయినాడు. భోజనానికి టికాణా లేదు. అతనిప్పుడు ఏకాకి! 'నా' అన్నవారెవరు లేరు!! కడుపు కాలుతున్నది. రంగనాథం క్షణం ఆలోచించి బజారువైపు నడిచాడు.

౨

రఘునాథం మదరాసులో గొప్ప అధికారి. ఆయన సుపుత్రి సరస్వతి. సుగుణముల కాలవాలము. పేరును సార్థక పరచు పండిత పుత్రి. కాబట్టి ప్రతి వారూ రఘునాథం గారితో సంబంధం చేయ నువ్వళ్లూరుతూ వుండేవాళ్లు. కాని రఘునాథం గారు కుమార్తెకు యుక్త వయస్సువచ్చే వరకు పెండ్లిచేయ నిశ్చయించుకోలేదు. పైగా రఘునాథంగారు గొప్ప వక్త. శ్రోతలను విస్మయాంబుధిలోల లాడించగల గంభీరోపన్యాసకుడు. సంఘసంస్కర్త. పండితాభిమాని. లక్షాధికారియని మొదటనే చెప్పియుంటిని!! ఇంక ఆయన కీర్తికి లోటేముంది?

ఆయన వడ్డీ వ్యాపారం చేస్తూ వుంటాడు. రెండు స్వంత బ్యాంకులున్నవి. డజనుమంది గుమాస్తాలు చేతిక్రింద వున్నారు. ఆయన మంచిధార్మికుడు "దేహి" అన్నవారలకు రిక్తహస్తాలతో పంపే మామూలు రఘునాథంగారికి లేదు.

ఆరోజున వుదయం తొమ్మిది గంటలయింది. రంగనాథం, రఘునాథంగారి దర్శనార్థమై వచ్చాడు. ఇద్దరూ ఏకాంతంగా ఒకగంటసేపు సంభాషించుకున్నారు. లోపల జరిగిన సంభాషణా సారాంశం మనకు తెలీదు. కాని గృహోన్ముఖుడైన రంగనాథం ముఖంమీద ఆనందం నృత్యంచేస్తూ వుంది. అతడు రఘునాథం బ్యాంకులో గుమాస్తాగా తీసికోబడినాడు.

రంగనాథం మంచి అందగాడు. అందమునకు తోడు అతని గుణములుకూడా దశసంవత్సర కారాగృహవాసంతో మారినయ్యి! ఇకనేం? అతడు అచిరకాలంలోనే రఘునాథంగారి విశ్వాసానికి పాత్రుడైనాడు. సంవత్సరంలో బ్యాంకు manager అయ్యాడు. నిరంతరం నాలుగయిదు లక్షల రూపాయిలు నిలువయుండే బ్యాంకులోని ఇనుపపెట్టె తాళం చెవులు యితని దగ్గర వుంటయ్యి. రఘునాథ, రంగనాథములు ఒకరి సలహాలేక వేరొకరు ఏపనీ చేసేవారు కాదు.

సరస్వతి కడుంగడు సౌందర్యవతి. ఇరువదియిదేండ్ల ప్రాయము. ఆమె రంగనాథమును ప్రేమించింది. రంగనాథం ఆమెను ప్రేమించినాడు. ప్రేమబీజము నాటబడినది. ఇక అది క్రమముగా మొలకలు చిగిర్చి పుష్పించి కాయలు కాయవలెను!!! రఘునాథమునకీ సంగతి తెలిసినది. అందుచేత ఆతడు రంగనాథమును పూర్వముకంటె అధికముగా ప్రేమించి, గౌరవించి, ఆదరింప జొచ్చెను. ఒకానొక శుభముహూర్తమున సరస్వతీ రంగనాథములకు అత్యంత వైభవముతో ఉద్వాహము జరిగెను.

రఘునాథమునకు సరస్వతి ఒక్కతెయే సంతానమగుటచే ఆయన ధనమునకు రంగనాథమే అధికారి అయినాడు. దుస్సహవాసియై, దుర్మార్గగామియై, జూదరియై, వేశ్యాలోలుడై, హంతకుడైన రంగనాథం, దశవత్సర పరిమితిలో సత్సంతకుడై సన్మార్గుడై, కోటీశు తనయయు, రూపసియునగు స్త్రీకి కాంతుడై, లక్షాధికారి అయినాడు!! హేలీలా మానుషా విగ్రహా! పరాత్పరా!! నీలీలలు చిత్రాతిచిత్రములు. నమస్తే, నమస్తే, నమః.

౪

విశేష సంపదల కధీశ్వరుడైన రంగనాథము కచ్చేరు సావిట్లో కూర్చుని గుమాస్తాలతో మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో తపాలా బంట్రోతు అతనికి ఒక కవరుయిచ్చి వెళ్ళినాడు. దానిమీద.

"Read alone" అని వ్రాసి వున్నది. వెంటనే అతడు గుమాస్తాలను వీడి తన పడక గదిచేరి ఏకాంతముగా యిట్లు చదువ దొడగెను.

మదరాసు.

18—8—1818

"తృతఘ్నుడా!—"

ఈ సంభోధన రంగ నాథానికి అచ్చెరు కల్గించింది. మూడు ఏండ్లనుండీ,—అతడు జైలు విముక్తుడైన పిమ్మట—అతడెవ్వరికీ ఏ అపకృతీచేసి యుండలేదే? అతడు తన జయిలు జీవితమునూ, తత్పూర్వస్థితినీ పూర్తిగా మరచినాడు.

"స్నేహితుడ నైన వేణుని—"

ఈ వాక్యం పూర్తిగా చదువకుండానే రంగనాథానికి పిచ్చి ఎత్తి నట్లయినది. తన పూర్వ జీవితం ఒక్కసారి కన్నులకు కట్టినట్లయింది. అప్రయత్నముగా కన్ను లశ్రుపూరితములైనవి. "మరల దుర్మార్గుడు వేణునాథం—తన జైలు ప్రాప్తికి కారణ భూతుడైన వేణు—హత్యా నేరమునకు తనను పురిగొల్పి, తాను పోలీసులనుండి తప్పించుకొన్న వేణు—సుఖప్రదముగా, శాంతముగా గడిచిపోవుచున్న సంసార ప్రవాహాన్ని చీకాకు పరచుటకై మరల ప్రాప్తించినాడా! ఏమో!! అతడుగూడ నావలెనే పశ్చాతాప మానసుడై, కష్టపరింపరలను జయించి సుఖంచుచు పూర్వ స్నేహ పురస్సరముగా వ్రాయుచున్నాడేమో?" మరల రంగనాథం వుత్తరమును చదువ నారంభించినాడు.

"...అప్పుడే మరచితివా? ఎంతటి కృతఘ్నుడవోయి! అయినను నిన్ను చూడ నాతురత పడుచున్నాను. కావున నాయందు దయయుంచి రాత్రి 11 గంటలకు దేవీ మందిరమున కలిసికొనుము..."

వేణు

రంగనాథము లేఖను పూర్తిగ చదివినాడు. రాత్రి దేవీ మందిరమునకే నిశ్చయించినాడు.

౫

రాత్రి పదిగంటల నలుబది నిమిషములైనది. అందరూ అప్పటికే నిద్రాముద్ర వహించారు. త్వర త్వరగా ఒకవ్యక్తి రఘునాథముగారి యింటినుండి వెలువడి దేవీ మందిరాభిముఖుడై పోయినాడు.

అచ్చటనే మరొకవ్యక్తి ఆతృతాసూచక వీక్షణములతో ఎవరికోసమో ఎదురుచూచుచున్నాడు. చిక్కి శల్యావశిష్టమైన దేహము, పెరిగిన గడ్డము, మాసిన గుడ్డలు, అతడు కష్టములకు లోనయ్యెనని చెప్పకయే చెప్పుచున్నవి.

సరిగా కార్పొరేషను గడియారం 11-గంటలు కొట్టినది. ఒకడు దేవీమందిరమును ప్రవేశించి రెండవవానితో పల్కినాడు.

"నీవేనా?"

"అవును! నేనే!!"

"ఏం పనిమీద వచ్చావు"

"రంగా! భాగ్యవంతుడవు కాగానే అంత గర్వమా?"

"పూర్వ స్నేహితుల్ని మరిచినావా"?

"వేణూ! కోపించకు నిన్ను మరిచిపోతే, ఈ అర్ధరాత్రివేళ ఈ పాడుబడ్డ గుడికివస్తానా?"

"సరే అదంతా ఎందుకు ఇలారా! ఓమాట"

చెవిలో ఏమేమో చెప్పినాడు వేణునాథం. ఆ మాటలు వినేసరికి రంగనాథం కోపంతో వుగ్రుడై పోయినాడు.

"ఓరీ! దుర్మార్గా! నీవు స్నేహితుడవని క్షమించాను. జాగ్రత! నన్ను మరల దుర్మార్గగామిగా చేయదలిచావా?"

"హహ్హాహ్హా" ఎంత పతివ్రతవైనావురా! రంగా! నీ ఆచారు దక్కనీయను. నీ చరిత్ర అంతాట మటమా చేస్తాను. తెలుసునా!"

రంగనాథం తల పైకెత్తి క్షణం ఆలోచించాడు. వెంటనే వేణునాథం చెంప చెళ్ళుమన్నది. రంగనాథ కాలిబూటులాగి వేణుని క్రిందపడేసి మెత్తగ చావ చితకకొట్టాడు.

"దంటం దశగుణం భవేత్" పెద్దలు చెప్పిన సామెత వృధాపోదు. వేణునాథానికి బుద్ధి వచ్చింది. లేచి "రంగా! నాకు నీతిగరిపావు. నేనుచేసిన తప్పులను క్షమించు" అన్నాడు.

"వేణూ ఇంద. ఇప్పటికైనా బుద్ధివచ్చినందుకు సంతోషం."

వేణునాథం, చేతిలో తరవాత చూచుకున్నాడు అయిదువందల రూపాయిల నోట్లని.

* * *

నాలుగు రోజులయింది. రంగనాథం ఆరోజున వీధివెంట వెళ్ళుతున్నాడు. ఓ ప్రక్కనవున్న సైను బోర్డునిలా చదివాడు.

"RANGANATH COFFEE CLUB,
*Propritor* VENUNATH."

ఆతురతతో రంగనాథం లోపలకు వెళ్ళినాడు. వేణు టేబిలువద్ద కూర్చుని డబ్బు వసూలు చేసికుంటున్నాడు ఫలహారాలు సేవించిన వారినుండి. ధనలక్ష్మి తాండవ మాడుతున్నది.

రంగనాథాన్ని చూడగానే తటాలున వచ్చి ఆలింగనం చేసుకుని ఆనంద భాష్పాలతోను స్వాగతమిచ్చాడు వేణు.